కాలువ కనుమరుగు!

- విలువైన భూములు దక్కించుకునేందుకు రియల్ ఎత్తుగడలు
- పంట భూములు కోతకు గురవుతున్నాయని అనుమతులు
- వరద నీటికే అడ్డుకట్ట వేసేవిధంగా నిర్మాణాలు
- ఆందోళనలో అన్నదాతలు

వేములవాడలోని పంప్‌హౌస్‌కు వెళ్లే రహదారిలో వరద కాలువ ఉన్నది. కోనాయపల్లి చెరువు, మల్లారం కట్టు కాలువ ద్వారా వచ్చే వరద ఈ కాలువ ద్వారా మూలవాగులో కలుస్తోంది. ప్రస్తుతం పట్టణంలో భూముల ధరలకు రెక్కలు రాగా, రెండో బైపాస్ రహదారికి ఆనుకొని ఉన్న ఈ కాలువపై రియల్ ఎస్టేట్ వ్యాపారుల కన్ను పడింది. దీంతో వారు ఇక్కడ కొంత భూమిని కొనుగోలు చేసి, కాలువను కనుమరుగు చేసేందుకు యత్నిస్తున్నారు. దాదాపు పది అడుగుల మేర కాలువను కబ్జా చేసి, నీటి ప్రవాహానికి అడ్డుగా నిర్మాణాలు చేపట్టారు. 30అడుగులు ఉండే కాలువ మూడు అడుగులకు చేరడంతో అన్నదాతలు వాపోయారు. భారీ వర్షాలతో ఎలాంటి ప్రమాదాలు జరుగుతాయోనని వారు ఆందోళన చెందుతున్నారు.

– వేములవాడ, జూన్ 14

వేములవాడ పట్టణంలోని పంప్ హౌస్ వద్ద వెళ్లే రహదారిలో కాలువకు ఇరువైపులా నిర్మాణాలు చేయడంతో చిన్నదిగా మారుతున్న కాలువ

పెరిగిన భూముల ధరలు, రియల్ ఆగడాలతో కాలువలు కనుమరుగవుతున్నాయి. నిబంధనల్లోని లొసుగులను ఆసరాగా చేసుకొని వేములవాడ పట్టణంలో విలువైన భూములను ఆనుకొని ఉన్న కాలువలను కబ్జా చేసే ప్రయత్నం చేస్తున్నారు. ఈ క్రమంలో రెండో బైపాస్ రహదారి సమీపంలోని భూములను (సర్వే నంబర్ 1411, 1412) కొందరు రియల్‌ఎస్టేట్ వ్యాపారులు కొనుగోలు చేశారు. పక్కనే ఉన్న వరద కాలువను కబ్జా చేసి విలువైన భూములు దక్కించుకునేందుకు వారు ఎత్తుగడ వేశారు. పంట పొలాలు భారీ వర్షాల నేపథ్యంలో కోత గురికాకుండా నిర్మాణాలు చేపట్టేందుకు అనుమతి పొందారు. నిబంధనలు అతిక్రమించి దాదాపు ఎనిమిది నుంచి పది అడుగుల మేర కాలువను మట్టితో నింపారు. నీటి ప్రవాహానికి అడ్డుగా నిర్మాణాలు చేపట్టడంతో చుట్టుపక్కల వ్యవసాయ భూములు ఉన్న రైతులు ఆందోళన చెందుతున్నారు.

వ్యవసాయ క్షేత్రం కోసమేనని అనుమతి

పంట పొలాలు కోతకు గురికాకుండా నిర్మాణాల కోసం అనుమతి పొందిన వ్యాపారులు.. ప్రభుత్వ నిబంధనలను అతిక్రమించారు. కాలువ చుట్టూ దాదాపు 300 అడుగుల మేర ప్రహరీ నిర్మాణానికి తెరలేపారు. మున్సిపల్ పరిధిలో ఐదు గుంటల లోపు మాత్రమే ఉన్న వాటికి అనుమతి ఉంటుంది. అంతకుమించి ఉన్న స్థలాలకు రీజనల్ డైరెక్టర్ పర్మిషన్ ఇవ్వాల్సి ఉంటుంది. ఎలాంటి అనుమతులు లేకుండానే నిర్మాణాలు చేపడుతున్నారని సమీప రైతులు ఆరోపిస్తున్నారు.

30నుంచి 3అడుగులకు కాలువ

భారీగా వర్షాలు కురిస్తే కోనాయపల్లి చెరువు, మల్లారం కట్టుకాలువ ద్వారా వచ్చే వరద వేములవాడలోని పంప్‌హౌస్ వెళ్లే రహదారిలో ఉన్న ఈ కాలువ ద్వారా మూలవాగులో కలుస్తోంది. అలాంటి వరద నీటి ప్రవాహం ఉండే కాలువను కాస్త చిన్నదిగా మారుస్తున్నారు. 30అడుగుల మేర ఉండే కాలువ.. ప్రస్తుతం ఇరువైపులా జరుగుతున్న నిర్మాణాలతో మూడు అడుగులకు చేరింది. భవిష్యత్‌లో వచ్చే వరద ప్రమాదాలకు దారి తీసేవిధంగా ఉండబోతుందని రైతులు ఆవేదన చెందుతున్నారు. కాలువను కబ్జా చేసి నిర్మాణాలు చేపడుతున్నా.. ఇంజినీరింగ్ విభాగం అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వస్తున్నాయి.

కాలువకు హద్దులు నిర్దేశించాలి

వ్యవసాయ భూముల్లో నుంచి వెళ్తున్న వరద కాలువ హద్దుల కోసం ఇప్పటికే అధికారులకు లెటర్లు రాశాం. నిబంధనల మేరకు మాత్రమే నడుచుకోవాలని అనుమతులు ఇచ్చాం. సంబంధిత రెవెన్యూ అధికారులు సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేస్తే కాలువను కాపాడుతాం. కాలువ ఎంతవరకు ఉంటుందో మా కూడా తెలియాలంటే హద్దులు నిర్దేశించాలి.

– శ్రీనివాస్, ఇరిగేషన్ డీఈ (వేములవాడ)

అధికారుల తీరు మారదా?

- ప్రజాప్రతినిధులకు కనీసం సమాచారం ఇవ్వరా..
- జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో నిలదీసిన సభ్యులు

సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ

రాజన్న సిరిసిల్ల, జూన్14 (నమస్తే తెలంగాణ): పాలకవర్గ పదవీకాలం గడువు ముగుస్తున్నా.. అధికారుల తీరు మాత్రం మారడం లేదంటూ ప్రజాప్రతినిధులు మండిపడ్డారు. తాము ప్రతినిధ్యం వహిస్తున్న మండలాల్లో తమకు సమాచారం ఇవ్వకుండానే కార్యక్రమాలు నిర్వహించడంలో అంత్యరమేమిటని నిలదీశారు. సమీకృత కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో బోయినపల్లి ఎంపీపీ వేణుగోపాల్ మాట్లాడారు. ప్రభుత్వం చేపట్టిన అమ్మ ఆదర్శ పాఠశాలల కింద పనులు చేస్తున్నారని, అమ్మ ఆదర్శ పాఠశాల పేరును తాను ఇప్పుడే వింటున్నానన్నారు. కొత్త పథకం వస్తే కనీసం ప్రజాప్రతినిధులకు సమాచారం కూడా ఇవ్వరా అని ప్రశ్నించారు. ఆర్‌అండ్‌బీ ఏఈ కోసం మండల పరిషత్ కార్యాలయంలో ఓ గది కూడా కేటాయించినా ఇప్పటి వరకు ఏఈ ఎలా ఉంటాడో తెలియని పరిస్థితి ఉందన్నారు. బోయినపల్లి మండలంలోని కొదురుపాక నుంచి ఒడ్యారం వరకు నాలుగు వరుసల రోడ్డు పనులు నడుస్తున్నాయని, ఆ పనులను చూసే అధికారి ఎవరో కూడా తెలియకుంటే మండల పరిషత్‌లు ఎందుకని నిలదీశారు. మండల పరిషత్‌లు తీసేసి జిల్లా పరిషత్, గ్రామ పంచాయతీలే కొనసాగించుకోవాలంటూ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఎన్‌క్వాస్ సర్టిఫికెట్ వస్తే కూడా తమకు సచారం ఇవ్వలేదని వైద్య, ఆరోగ్యశాఖ అధికారిపై మండిపడ్డారు. ప్రభుత్వ కార్యక్రమాలు చేపడితే తమకు సమాచారం ఇవ్వమని.. ఐదేండ్ల నుంచి ప్రతి మీటింగ్‌లో చెపుతున్నా అధికారులు తీరు మాత్రం మారడం లేదంటూ పలువురు ప్రజాప్రతినిధులు ఆరోపించారు. ఇల్లంతకుంట నుంచి సిద్దిపేట వరకు నాలుగు వరుసలు, జిల్లెల్ల నుంచి ఇల్లంతకుంట వరకు మంజూరైన రోడ్ల పనులను ఎందుకు నిలిపివేశారంటూ జడ్పీ వైస్‌చైర్మన్ సిద్ధం వేణు ప్రశ్నించారు. ఎన్నికల కోడ్ ఉన్నందున కొన్ని కార్యక్రమాలకు సమాచారం ఇవ్వలేక పోయామని జడ్పీసీఈవో ఉమారాణి సమాధానం చెప్పారు. ఇల్లంతకుంట ఎంపీపీ మాట్లాడుతూ, మిషన్ భగీరథ పనులు చూసే అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. ట్యాంకులు కూడా సరిగా నింపడం లేదని, ఇంటింటికీ నీరందడం లేదన్నారు. కాలిపోయిన మోటార్లకు, పంపుసెట్ల మరమ్మతులకు పెట్టుబడి ఎవరు పెడుతారని ప్రశ్నించారు. పంచాయతీలలో నిధులు లేవని, మంచినీటి సరఫరాలో ఇబ్బందులు తొలగించాలని డిమాండ్ చేశారు.

సమన్వయంతో ముందుకెళ్లాలి

అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో అభివృద్ధి పనులు చేపట్టాలని జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ సూచించారు. వానలు కురుస్తున్నందున రైతులకు వ్యవసాయాధికారులు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యశాఖ అధికారులను కోరారు. పారిశుధ్య పనులను వేగవంతం చేయాలని డీపీవోకు సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ భీమ్యానాయక్, డీఎఫ్‌వో బాలమణి, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ

మరమగ్గాలను ఆధునీకరించుకోవాలి

రాజన్న సిరిసిల్ల జూన్14 (నమస్తే తెలంగాణ): సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలో పురాతన మరమగ్గాలను ఆధునీకరించుకోవాలని చేనేత జౌళిశాఖ ఏడీ మిట్టకోల సాగర్ శుక్రవారం ఒక ప్రకటన ద్వారా సూచించారు. పాతకాలం నాటి సాంచాలపై ఆధునిక వస్త్రాలు ఉత్పత్తి చేయడం సాధ్యంకాదన్నారు. పోటీకి అనుగుణంగా ఆధునిక సాంచాలు ఏర్పాటు చేసుకుని నాణ్యమైన వస్త్రాలు తయారు చేయాలని యజమానులు, ఆసాములకు పిలుపునిచ్చారు. 2022లో ఉత్పత్తి చేసిన బతుకమ్మ చీరలకు సంబంధించి యారన్ సబ్సిడీ రూ.3.84కోట్లు విడుదల చేయాలని టెస్కో హైదరాబాద్ ఎండీకి సిఫారసు చేసినట్లు తెలిపారు. 724మంది కార్మికులకు సంబంధించి రూ.86లక్షలు వారి బ్యాంక్ ఖాతాలో విడుదల చేశామన్నారు.

ప్రవేశాలకు ఆహ్వానం

సిరిసిల్ల రూరల్, జూన్ 14: తంగళ్లపల్లిలోని గిరిజన సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ రజినీ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2024-25 విద్యా సంవత్సరంలో జనరల్ డిగ్రీ కోర్సులైన ఫిజికల్ సైన్స్, లైఫ్ సైన్స్, బీకాం, బీఏ కోర్సులలో మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని గిరిజన, గిరిజనేతర విద్యార్థులు ఈ నెల 17నుంచి 23 వరకు స్పాట్ అడ్మిషన్లు కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెల 25న కౌన్సెలింగ్ ఉంటుందని తెలిపారు. పూర్తి వివరాల కోసం నంబర్‌ను (7901097693) సంప్రదించాలని సూచించారు.

నేడు 'బెస్ట్ అవైలబుల్'కు విద్యార్థుల ఎంపిక

కలెక్టరేట్, జూన్ 14: బెస్ట్ అవైలబుల్ స్కూల్‌లో ఒకటో తరగతిలో ప్రవేశాల కోసం శనివారం లాటరీ పద్ధతిన విద్యార్థులను ఎంపిక చేసామని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి వినోద్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో అదనపు కలెక్టర్ భీమ్యానాయక్ ఆధ్వర్యంలో లాటరీ ద్వారా విద్యార్థులను ఎంపిక చేస్తామన్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఉదయం 11గంటలలోగా కలెక్టరేట్‌కు చేరుకోవాలన్నారు.

అంధుల ఆశ్రమ పాఠశాలలో అడ్మిషన్లు ప్రారంభం

కలెక్టరేట్, జూన్ 14: ఉత్తర తెలంగాణ జిల్లాలలోని అంధ విద్యార్థుల కోసం అడ్మిషన్లు ప్రారంభించినట్లు కరీంనగర్‌లోని ప్రభుత్వ అంధుల ఆశ్రమ పాఠశాల ప్రిన్సిపాల్ బీ నర్మద శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలో శాతవాహన యూనివర్సిటీ ఎదురుగా మల్కాపూర్ రోడ్‌లో ఉన్న ప్రభుత్వ అంధుల ఆశ్రమ పాఠశాలలో అడ్మిషన్లు తీసుకుంటున్నామని తెలిపారు. ఇంగ్లిష్ మీడియం ఒకటి నుంచి ఏడో తరగతి వరకు, తెలుగు మీడియం ఒకటి నుంచి పదో తరగతి వరకు ఉంటుందని తెలిపారు. ఉచితంగా విద్య, భోజనవసతితోపాటు కంప్యూటర్ శిక్షణ అందిస్తామన్నారు. 6 నుంచి 14ఏండ్ల వయసు ఉన్నవారు పాఠశాలలో చేరేందుకు అర్హులని తెలిపారు. ప్రతిఒక్కరూ అంధ బాలబాలికలను కరీంనగర్‌లోని ప్రభుత్వ అంధుల ఆశ్రమ పాఠశాలలో చేర్పించి వారి జీవితాల్లో వెలుగులు నింపాలని కోరారు. పూర్తి వివరాల కోసం నంబర్లలో (9494 317315, 9701190124, 739620 6959, 9440338424) సంప్రదించాలని సూచించారు.

రాజన్న సిరిసిల్ల: సంజీవయ్యనగర్‌లో రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

చందుర్తి: ఎన్గల్‌లో పిడుగుపాటుతో మృతిచెందిన పాడిగేదె

దంచికొట్టిన వాన

- తెగిపడిన విద్యుత్ వైర్లు
- నిలిచిపోయిన విద్యుత్ సరఫరా
- ఎన్గల్‌లో పిడుగుపాటుతో పాడిగేదె మృతి

వేములవాడ: జాతరగ్రౌండ్ రహదారిలో రోడ్డుపై ప్రవహిస్తున్న వరద

రాజన్న సిరిసిల్ల, జూన్ 14 (నమస్తే తెలంగాణ): జిల్లాలో శుక్రవారం ఈదురు గాలులతో వాన దంచికొట్టింది. మధ్యాహ్నం 1.30 నుంచి 2.30గంటల వరకు భారీ వర్షం పడింది. మెరుపులు, ఉరుములతోపాటు ఈదురు గాలులు వీయడంతో రోడ్లపక్కన ఉన్న చెట్ల కొమ్మలు స్తంభాలపై విరిగిపడి విద్యుత్ తీగలు తెగి కిందపడిపోయాయి. దీంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. సిరిసిల్ల పట్టణంలోని పలు వార్డుల్లో విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, అధ్వర్యంలో డైరెక్టర్లు, అధికారులు వార్డులను సందర్శించి విద్యుత్ పునరుద్ధరణకు చర్యలు తీసుకున్నారు. పట్టణంలోని సుభాష్‌నగర్‌లో గల బీమనాతిని సుధాకర్ ఇంటి పైకప్పు రేకులు గాలిదుమారానికి లేచిపోయాయి. జిల్లా కేంద్రంతోపాటు వేములవాడ, బోయినపల్లి, గంభీరావుపేట మండలాల్లో వర్షం కురిసింది. ముస్తాబాద్, వీర్నపల్లి, ఎల్లారెడ్డిపేట మండలాల్లో ఆకాశం మేఘావృతమై కనిపించింది. భారీ వర్షంతో ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. రెండు రోజులుగా ఒక్కటే ఉక్కపోతతో జనం తల్లడిల్లి పోయారు. కురిసిన భారీ వర్షంతో ఉపశమనం పొందారు. మరో రెండు రోజులు భారీ వర్షాలు ఉన్నట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

ఉరుములు, మెరుపులతో వర్షం

వేములవాడ/బోయినపల్లి/ ఇల్లంతకుంట/చందుర్తి, జూన్ 14: వేములవాడ పట్టణంతోపాటు పలు మండలాల్లో శుక్రవారం దాదాపు అరగంటకు పైగా ఉరుములు మెరుపులతో కూడిన వర్షం పడింది. రాజన్న ఆలయ పరిసరాల్లో భక్తులు వర్షానికి తడిసి ముద్దయ్యారు. జాతరగ్రౌండ్ రహదారిపై వరద ప్రవహించగా భక్తులు, ప్రజలు ఇబ్బందులు పడ్డారు. అలాగే ఇల్లంతకుంట, బోయినపల్లి మండలాల్లో వర్షం పడగా, విత్తనాలు నాటేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. చందుర్తి మండలం ఎన్గల్ గ్రామంలో పిడుగు పాటుకు పకిడె రాజయ్యకుకు చెందిన పాడి గేదె మృతి చెందింది. సుమారు రూ.60వేల నష్టం వాటిల్లిందని బాధిత రైతు వాపోయాడు.

'ధరణి' సమస్యలు పరిష్కరించాలి

- సీసీఎల్ఏ కమిషనర్ నవీన్‌మిట్టల్
- వీసీ ద్వారా అధికారులతో సమీక్ష

వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్ అనురాగ్ జయంతి, అధికారులు

కలెక్టరేట్, జూన్ 14: ప్రత్యేక కార్యాచరణ ద్వారా పెండింగ్ ధరణి సమస్యలను పరిష్కరించాలని సీసీఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్ అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ సీసీఎల్ఏ కార్యాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో పెండింగ్ ధరణి సమస్యల పరిష్కారంపై శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా నవీన్ మిట్టల్ మాట్లాడుతూ, ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తుల పరిష్కారానికి మరోసారి ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని ఆదేశించారు. తహసీల్దార్, రెవెన్యూ డివిజన్ అధికారి, అదనపు కలెక్టర్, కలెక్టర్ స్థాయిలలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వేగవంతంగా పరిష్కరించేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని సూచించారు. సక్సేషన్, పెండింగ్ మ్యూటేషన్ దరఖాస్తులు, రికార్డులు పరిష్కరించాలన్నారు. మండలాల వారీగా పెండింగ్ దరఖాస్తులను రివ్యూ చేసుకోవాలని, అధికంగా పెండింగ్ ఉన్న మండలాలకు అవసరమైన అదనపు సిబ్బంది కేటాయించాలన్నారు. ధరణి వెబ్‌సైట్‌కు సంబంధించి జీఎల్ఎం, టీఎం 33 దరఖాస్తులలో డిజిటల్ సంతకాల ప్రక్రియ మార్పులు చేస్తున్నామని తెలిపారు. సీఎం ఆదేశాల మేరకు ప్రతి మంగళవారం, శుక్రవారాల్లో నిర్వహించే ప్రజావాణిలో వచ్చే భూసంబంధిత సమస్యలను సైతం కలెక్టర్లకు బదిలీ చేస్తున్న సమస్యలు సత్వర పరిష్కారం అయ్యేలా చూడాలన్నారు. ప్రతి మండలంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఏర్పాటుకు అనువైన భవనం లేదా భూమి కేటాయించి ప్రతిపాదనలు సమర్పించాలని కలెక్టర్లకు సూచించారు. అనంతరం సంబంధిత అధికారులతో కలెక్టర్ అనురాగ్ జయంతి మాట్లాడారు. జిల్లాలో పెండింగ్ ఉన్న ధరణి దరఖాస్తులను ప్రణాళికాబద్ధంగా పరిష్కరించాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌కు అదనపు కలెక్టర్ భీమ్యానాయక్, ఆర్డీవో రమేశ్, అన్ని మండలాల తహసీల్దార్లు, అధికారులు హాజరయ్యారు.

రక్తదానం చేయండి

వేములవాడ, జూన్ 14: రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలువాలని నేత్ర వైద్యుడు రమణారావు కోరారు. శుక్రవారం ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని యువ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీని ప్రారంభించారు. ఇక్కడ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు గుడిసెల రాజశేఖర్‌గౌడ్, మార్నింగ్ క్రికెట్ క్లబ్ సభ్యులు, యువ ఫౌండేషన్ సభ్యులు ఉన్నారు.

మనోహర్‌రెడ్డి పరామర్శ

వేములవాడ రూరల్, జూన్ 14: అగ్రహారంలో జవ్వాజి ఎల్లయ్యగౌడ్, సంకెపల్లిలో బండారి అంజయ్య ఇటీవల మృతి చెందగా, బాధిత కుటుంబ సభ్యులను బీఆర్ఎస్ నేత ఏనుగు మనోహర్ రెడ్డి శుక్రవారం పరామర్శించారు. ఆయన వెంట నాయకులు బుర్ర మురళి, మచ్చ బుచ్చయ్య, ముత్త మహేశ్, నాగుల రాము, జింక శ్రీధర్, పండుగ రాజమల్లు, పండుగ మల్లేశం, పండుగ రవి, జింక మధు, బుర్ర శ్రీనివాస్, ప్రవీణ్, అజయ్, బాలరాజు, రుద్రవేణి నాగరాజు, మంద అనిల్‌కుమార్, పల్లి ఎల్లయ్య గౌడ్, భాస్కర్‌రావు, పరశురాములు, వెంకటేశం ఉన్నారు.

బ్యాంక్ పనుల పరిశీలన

వేములవాడ రూరల్, జూన్ 14: పట్టణంలోని సెస్ రోడ్డులో నిర్మిస్తున్న కేడీసీసీ బ్యాంకు పనులను సింగిల్‌విండో చైర్మన్ ఏనుగు తిరుపతిరెడ్డి, బ్యాంక్ మేనేజర్ సాయి పరిశీలించారు. వీలైనంత త్వరగా పనులు పూర్తిచేయాలని సూచించారు.

కరాటేతో మనోధైర్యం

వేములవాడ టౌన్, జూన్ 14: కరాటే నేర్చుకుంటే మనోధైర్యం కలిగి ఉంటారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. ఇటీవల కరీంనగర్‌లో జరిగిన రాష్ట్రస్థాయి కరాటే పోటీలతోపాటు సమ్మర్ క్యాంప్‌లో శిక్షణ పొందిన 40 మంది విద్యార్థులను శుక్రవారం ఎమ్మెల్యే గెస్ట్‌హౌస్‌లో శ్రీనివాస్ అభినందించారు.

విద్యార్థులకు సామగ్రి పంపిణీ

ఎల్లారెడ్డిపేట, జూన్ 14: మండల కేంద్రంలోని కిషన్‌దాస్‌పేట ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బీఆర్ఎస్ యువజన నాయకుడు మహ్మద్ సల్మాన్ శుక్రవారం పలకలు, పెన్సిళ్లు, ఇతర సామగ్రిని అందించారు. అలాగే బొప్పాపూర్‌లోని ఎంపీపీఎస్‌లో ఎంపీటీసీ గీతాంజలి ఆధ్వర్యంలో అక్షరాభ్యాసం చేయించారు. ఇక్కడ ఎంపీడీవో సత్తయ్య, ఎంపీటీసీ పందిళ్ల నాగరాణి, తదితరులు ఉన్నారు.

'భగీరథ' సరఫరాలో అంతరాయం

బోయినపల్లి, జూన్ 14: మండలంలో నాలుగు రోజులుగా మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వేములవాడ మండలం శాత్రాజ్‌పల్లి వద్ద మిషన్ భగీరథ పైపులైన్ పగిలిపోయినట్లు తెలిసింది. మరమ్మతులతోపాటు పరిష్కార దిశగా మిషన్ భగీరథ అధికారులు చర్యలు తీసుకోవడం లేదనే ఆరోపణలున్నాయి.

రక్తదాతకు అవార్డు

ఎల్లారెడ్డిపేట, జూన్ 14: మండల కేంద్రానికి చెందిన వంగ గిరధర్‌రెడ్డి హైదరాబాద్‌లో రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ అజయ్ మిశ్రా చేతుల మీదుగా శుక్రవారం ఇంటర్నేషనల్ బ్లడ్ డోనర్స్ అవార్డు అందుకున్నారు. 48సార్లు రక్తదానం చేసిన గిరిధర్‌రెడ్డికి రెడ్‌క్రాస్ సొసైటీ 20వ వార్షికోత్సవం సందర్భంగా అవార్డు అందించారు.

బస్సు ఢీకొని యువకుడి మృతి

రుద్రంగి, జూన్ 14: ఆర్టీసీ బస్సు ఢీకొని యువకుడు మృతి చెందిన ఘటన రుద్రంగి శివారులో శుక్రవారం చోటుచేసుకున్నది. ఎస్ఐ అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. రుద్రంగి మండల కేంద్రానికి చెందిన గండి అజయ్(18), బోయిని అభిషేక్ ద్విచక్ర వాహనంపై కలిగోట నుంచి రుద్రంగికిక బయలుదేరారు. ఈ క్రమంలో రుద్రంగి శివారులో మూలమలుపు వద్ద వేములవాడ నుంచి కోరుట్ల వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు వీరిని ఢీకొట్టడంతో అజయ్ అక్కడికక్కడే మృతి చెందాడు. అభిషేక్‌కు తీవ్ర గాయాలు కావడంతో వేములవాడలోని ప్రభుత్వ దవాఖానకు తరలించారు. అజయ్ కుటుంబానికి నష్టపరిహారం అందించాలని గ్రామస్తులు, కుటుంబ సభ్యులు కోరుట్ల-వేములవాడ ప్రధాన రహదారిపై నిరసన తెలిపారు. చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ అశోక్ ఘటనా స్థలానికి చేరుకొని వారితో మాట్లాడారు. అజయ్ మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం సిరిసిల్ల దవాఖానకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

నేరెళ్ల శివారులో ఆర్టీసీ బస్సు, డీసీఎం వ్యాన్ ఢీ

సిరిసిల్ల రూరల్, జూన్ 14: వేములవాడ డిపోకు చెందిన ఆర్టీసీ డీలక్స్ బస్సు శుక్రవారం వేములవాడ నుంచి సికింద్రాబాద్‌కు బయలుదేరింది. నేరెళ్ల శివారుకు చేరుకోగానే ప్రమాదకరమైన మూలమలుపు వద్ద ఎదురెదురుగా బస్సు, డీసీఎం వ్యాన్ ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో బస్సు డ్రైవర్ ఇంద్రసేనారెడ్డితోపాటు శంకర్, వైష్ణవి, ఎండీ ఇక్బాల్, పుల్కం లక్ష్మి అనే ప్రయాణికులకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వీరిని అంబులెన్స్‌లో సిరిసిల్ల ప్రభుత్వ దవాఖానకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కార్యవర్గం ఎన్నిక

సిరిసిల్ల టౌన్, జూన్ 14: సిరిసిల్ల పాలిస్టర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నికలు శుక్రవారం స్థానిక పాలిస్టర్ సంఘం భవనంలో జరిగాయి. అధ్యక్షుడిగా ఆడెపు భాస్కర్, ఉపాధ్యక్షుడిగా దూడం రమేశ్, ప్రధాన కార్యదర్శిగా అంకారపు రవి, కోశాధికారిగా మండల బాలరాజు, సహాయ కార్యదర్శిగా బండారి అశోక్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వీరిని పాలిస్టర్ అసోసియేషన్ సభ్యులు, ఎన్నికల అధికారి పోపా ఉపాధ్యక్షుడు మామిడాల భూపతి అభినందించారు.

పట్టుదలతో శ్రమిస్తే ఉజ్వల భవిష్యత్

తెలంగాణ చౌక్, జూన్ 14: విద్యార్థులు పట్టుదలతో శ్రమిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని హెచ్ఎం భాగ్యరేఖ పేర్కొన్నారు. ఎన్ఎంఎంఎస్ పరీక్షలో ప్రతిభ చూపిన సిరిసిల్ల పట్టణంలోని నెహ్రూనగర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను (ఆడెపు లిఖిత్, లహరి, నిహిత) హెచ్ఎం భాగ్యరేఖ శుక్రవారం అభినందించారు. ఇక్కడ టీచర్లు శ్రీనివాస్‌రావు, రాజశేఖర్, భారతి, సలావుద్దీన్ తదితరులు ఉన్నారు.

ప్రజా ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలి: ఎస్పీ

సిరిసిల్ల రూరల్, జూన్ 14: ఫిర్యాదులపై తక్షణమే స్పందించి, ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందించాలని ఎస్పీ అఖిల్ మహాజన్ సూచించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన తంగళ్లపల్లి పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. ఠాణాలోని పరిసరాలు, రికార్డులను పరిశీలించి మాట్లాడారు. డయల్ 100కు స్పందించి, వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని సమస్యలు పరిష్కరించాలన్నారు. బ్లూకోల్ట్స్, పెట్రోల్ కార్ నిరంతరం గస్తీ నిర్వహించాలన్నారు. గ్రామాల్లో ఎలాంటి ఘటనలు జరిగినా పై అధికారులకు తక్షణమే తెలియజేయాలని సూచించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో అవాంఛనీయ ఘటనలు జరుగకుండా సిబ్బంది అందరూ కృషి చేయాలన్నారు. ప్రతి రోజూ వాహనాల తనిఖీ చేపట్టాలని, మైనర్ డ్రైవింగ్, నంబర్ ప్లేట్ ట్యాపరింగ్, ట్రిబుల్ డ్రైవింగ్, ర్యాష్ డ్రైవింగ్, డ్రంకెన్‌డ్రైవ్‌పై దృష్టిసారించాలన్నారు. ఆయన వెంట ఎస్ఐ సుధాకర్, సిబ్బంది ఉన్నారు.

యారన్ సబ్సిడీ అందించాలి

- కలెక్టరేట్ ఎదుట పవర్‌లూమ్ కార్మికుల ధర్నా

కలెక్టరేట్, జూన్ 14: సిరిసిల్లలోని పవర్‌లూం కార్మికులకు పదిశాతం యారన్ సబ్సిడీ వెంటనే అందించాలని పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేశ్ డిమాండ్ చేశారు. గతంతో మాదిరిగా యారన్ సబ్సిడీ అందించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ పవర్‌లూమ్ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్ ఎదుట కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడుతూ, కార్మికులకు యారన్ సబ్సిడీ వెంటనే ఇవ్వాలన్నారు. జౌళిశాఖ కమిషనర్ తీసుకుంటున్న నిర్ణయాలతో సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ కనుమరుగయ్యే పరిస్థితి నెలకొందన్నారు.